ప్రజాశక్తి
శనివారం 28 జూన్ 2025
5
శ్రీకాకుళం

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రజాశక్తి - గార

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. మండలంలోని అంపోలులో గల ప్రధాన జైలును శుక్రవారం పరిశీలించారు. ఖైదీలతో ముచ్చటించిన ఆయన వారి అభ్యంతరాలు, సమస్యలు, బెయిల్ పిటిషన్ల పురోగతిపై మాట్లాడారు. ఇప్పటివరకు బెయిల్ కోసం దరఖాస్తు చేసిన ఖైదీల వివరాలను సేకరించారు. జైలు భద్రత, ఆహార పద్ధతులు, పరిశుభ్రతపై స్వయంగా సమీక్షించి జైలు అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. అనంతరం నరసన్నపేట సబ్ జైలునూ సందర్శించి అక్కడి ఖైదీల పరిస్థితులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ దివాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా..?

- పూర్తిస్థాయిలో జిల్లాకు చేరని వరి విత్తనాలు
- గుర్రపుడెక్క, పూడికతో నిండిన సాగునీటి కాలువలు
- అపరిష్కృతంగానే షట్టర్ల సమస్య
- నేడు జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్‌పి నూతన సమావేశం మందిరంలో శనివారం నిర్వహించనున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో విత్తనాల సమస్య ప్రధానంగా నెలకొంది. రైతులకు కావాల్సిన విత్తనాలు దొరక్కపోవడంతో ప్రయివేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు రైతులు కొనుగోలు చేస్తున్నారు. ఖరీఫ్‌లో ఈ సంవత్సరం సాగునీటి సమస్యలు తప్పేలా లేవు. సీజన్ ప్రారంభమైనా, వంశధార కాలువల్లో గుర్రపుడెక్క, పూడిక తొలగించలేదు. షట్టర్ల అవినీతిపై సిఐడి కేసు ఉండడంతో కొత్తవి అమర్చక పాడైన వాటితోనే నెట్టుకొస్తున్నారు. గతంలో టిడిపి హయాంలో నిర్మించిన ఇళ్ల బిల్లుల చెల్లింపుల కోసం సర్వే చేసి ఆరు నెలలు కావస్తున్నా డబ్బులు రాక వేలాది మంది లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. వీటితోపాటు విద్యుత్, ఆర్ అండ్ బి రోడ్లు తదితర సమస్యలూ ఉన్నాయి. వీటిపై సభ్యులు చర్చించి ఏం పరిష్కారం చూపుతారని ఎదురుచూస్తున్నారు.

హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార కుడి, ఎడమ కాలువల కింద 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో ఎడమ కాలువ ద్వారా 1.70 లక్షల ఎకరాలు, కుడికాలువ ద్వారా 80 వేల ఎకరాలకు నీటిని అందించాల్సి ఉంది. కాలువల పరిస్థితి దయనీయంగా ఉండడంతో, నిర్దేశించిన ఆయకట్టుకు నీరందడం లేదు. ముఖ్యంగా శివారు భూములకు నీరందని పరిస్థితి ఏటా పునరావృతమవుతోంది. సాగునీటి కాలువలు చాలా బలహీనంగా ఉండడం, కాలువల్లో పెద్దఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. వంశధార ఎడమ కాలువ సామర్థ్యం 2,450 క్యూసెక్కులు కాగా, కాలువ గట్లు బలహీనంగా ఉండడంతో 1800 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. కుడి కాలువ సామర్థ్యం 800 క్యూసెక్కులు కాగా, 500 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. వంశధార రెండు కాలువల్లోనూ విపరీతంగా గుర్రపుడెక్క పేరుకుపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది.

అంతంతమాత్రంగానే పనులు

వంశధార కుడి, ఎడమ కాలువల్లో గుర్రపుడెక్క, పూడిక తొలగించేందుకు చేపడుతున్న పనులు అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద రూ.5.84 కోట్లతో 151 రకాల పనులు చేపడుతున్నాం. ఇందులో రూ.కోటి విలువైన 58 పనులు ప్రగతిలో ఉన్నాయి. వంశధార కాలువ గట్లను పటిష్టపరచడం, బ్రీచ్‌లను పూడ్చడం వంటి పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. రూ.4.10 కోట్ల విలువైన 117 రకాల పనులను చేపడుతున్నాం. అందులో రూ.3.80 కోట్ల విలువైన 113 రకాల పనులు ప్రగతిలో ఉన్నాయి.

వెంటాడుతున్న వరద భయం

కరకట్టలకు సంబంధించి కొత్త ప్రాతిపాదనలను అధికారులు పంపి రెండేళ్లు గడుస్తున్నా, ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. నిర్మాణ వ్యయం అధికంగా ఉండడంతో వైసిపి ప్రభుత్వం వాటిని ఉన్నపళంగా ఆపేసింది. ముంపు తీవ్రత అధికంగా ప్రాంతాలను గుర్తించి అందులో ముఖ్యమైన పనులకు ప్రాధాన్యమివ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలతో నాగావళి నదీ పరివాహక ప్రాంతంలో ఐదు ప్రాంతాలు, వంశధార వెంబడి 23 కిలోమీటర్ల మేర కరకట్టల నిర్మాణానికి మొత్తం రూ.130 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలపై కూటమి ప్రభుత్వం ఏమీ తేల్చడం లేదు.

షట్టర్ల సమస్యకు ఏం పరిష్కారమో?

నరసన్నపేట వంశధార ఇంజినీరింగ్ అధికారులు 2009లో కొనుగోలు చేసిన షట్టర్లలో బయటపడ్డ అవినీతి సాగు రంగానికి శాపంగా మారింది. అధిక ధరకు కొనుగోలు చేశారన్న ఆరోపణలపై సిఐడి రంగంలోకి దిగి విచారణ చేపట్టింది. ఇప్పటికీ ఆ కేసు కోర్టులో పెండింగ్‌లోనే ఉంది.

దాదాపు 15 ఏళ్లు గడుస్తున్నా కేసు తేలకపోవడంతో కాలువలపై ఏర్పాటు చేయాల్సిన షట్టర్లు కార్యాలయాల్లోనే మూలుగుతున్నాయి. హిరమండలం, టెక్కలి, కోటబొమ్మాళి , జలుమూరు ప్రాంతాల్లో గోడౌన్లలో సుమారు రూ.5 కోట్ల విలువ చేసే 700 షట్టర్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రస్తుతం ఇవి పాడైపోవడంతో కాలువలపై బిగించడానికి అవకాశం లేకుండా పోయింది. వాటిని వేలం వేసి కొత్తగా కొనుగోలు చేయాల్సి ఉంది. అలా చేయాలంటే ప్రభుత్వం కేసును సాధ్యమైనంత తొందరగా ముగింపు పలకాల్సి ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ఇళ్ల నిర్మాణ బిల్లులు రాక ఇబ్బందులు

జిల్లాలో 2014 నుంచి 2018 వరకు నిర్మించిన ఎన్‌టిఆర్ గృహాలకు ఇప్పటికీ ప్రభుత్వం డబ్బులు చెల్లించలేదు. ఇళ్ల కేటాయింపులు, నిర్మాణాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలతో ప్రభుత్వం వాటికి డబ్బులు ఆపేసింది. ఇళ్లను పరిశీలించి డబ్బులు చెల్లిస్తామని చెప్పినా, ఇప్పటివరకు లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేయలేదు. జిల్లాలో సుమారు 37,215 ఇళ్లకు రూ.50.33 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. సర్వే పూర్తి చేసి ఆరు నెలలు కావస్తున్నా ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడంతో, లబ్ధిదారులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

పూర్తిస్థాయిలో జిల్లాకు చేరని విత్తనాలు

ప్రస్తుత ఖరీఫ్‌కు వరి రకం విత్తనాలు 38,499 క్వింటాళ్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. అందులో ఇప్పటివరకు 34 వేల క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయి. జిల్లాకు చేరిన విత్తనాల్లో రైతులకు 23 వేల క్వింటాళ్ల వరకు పంపిణీ చేశారు. రైతులు కోరుకుంటున్న సంపత్, నందిని, అమూల్య, 1271 తదితర రకాల విత్తనాలు లేకపోవడంతో బహిరంగ మార్కెట్‌లో వారు అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు.

పైడికొండ ప్రాంతంలో చేపడుతున్న మట్టి తవ్వకాలు

చెలరేగిపోతున్న మట్టి మాఫియా

- యథేచ్ఛగా తరలిపోతున్న ఎర్రమట్టి
- పట్టించుకోని అధికారులు

చీకటి పడితే చాలు... నిశ్శబ్దాన్ని చెరిపేస్తూ మెరుపు లైట్లతో... రయ్ మంటూ పదుల సంఖ్యలో టిప్పర్లు దూసుకెళ్తున్నాయి. చీకటి మొదలు... వేకువజాము వరకూ యథేచ్ఛగా ఎర్రమట్టిని తరలిస్తున్నాయి. గ్రావెల్, మట్టిని ఆదాయ వనరుగా మార్చుకున్న మాఫియా అనుమతులతో పని లేకుండానే పని కానిచ్చేస్తోంది. నిబంధనలు తొక్కిపెట్టి మరీ లక్షలాది రూపాయలను ఆర్జిస్తోంది. ఐదు రోజులుగా పొందూరు పరిసర ప్రాంతాలలోని పైడికొండ నుంచి ఈ తంతు సాగుతున్నా... తహశీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ ముందు నుంచే టిప్పర్లు వెళ్తున్నా ఆయా శాఖల అధికారులకు కనిపించకపోవడం, తెలియకపోవడం ఇక్కడ విశేషం.

ప్రజాశక్తి - పొందూరు

పొందూరు పైడికొండ సమీపంలోని సర్వే నెంబర్ 42, 90-8లో గ్రావెల్ తవ్వకాలను అక్రమంగా చేపడుతున్నారు. రైల్వే పనుల పేరుతో ఎకరాల విస్తీర్ణంలో సుమారు 15 అడుగుల లోతులో గ్రావెల్‌ను తవ్వి టిప్పర్లతో తరలిస్తున్నారు. ఈ తవ్వకాలకు రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతులు లేకపోయినా ఐదు రోజులుగా యథేచ్ఛగా ఎర్రమట్టిని తరలిస్తున్నారు. దీంతో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. పట్టణానికి దూరంగా ఉన్న ఈ పైడికొండలో ఎర్రమట్టి నిల్వలు విస్తారంగా ఉండడంతో, జెసిబిలతో తవ్వకాలు చేసి టిప్పర్లతో తరలిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. పొందూరు పట్టణానికి చెందిన కొందరు కమీషన్లకు మాట్లాడుకుని తవ్వకాలు చేపడుతున్నట్లు సమాచారం. రైల్వే పనులకు గ్రావెల్‌ను తరలించాలంటే రెవెన్యూ, మైనింగ్ అనుమతులతో పాటు ఏ సర్వే నంబరులో ఎంత తవ్వకాలు చేపట్టనున్నామనే విషయాలను ప్రస్తావిస్తూ అనుమతులు తీసుకుని రాయల్టీని చెల్లించాలి. ఇవేవీ లేకుండానే ఒక సర్వే నంబరులో చదును పేరుతో అనధికార అనుమతి పత్రంతో గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. ఇటు అధికారులు అటు స్థానిక నాయకులకు ఎవరి వాటాలు వారికి ముట్టడంతో అడ్డూ అదుపు లేకుండా అక్రమ రవాణా సాగుతోంది. మరోవైపు పైడికొండ సమీపంలోని జగనన్న కాలనీవాసులు రాత్రి వేళ టిప్పర్ల రాకపోకలతో భయాందోళనలు చెందుతున్నారు. వేగంగా వాహనాలు వెళ్తుండడంతో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

ఎర్రమట్టిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న టిప్పర్లు

పైడికొండ వద్ద తవ్వకాలు చేసిన ప్రాంతం

కేసులు నమోదు చేస్తాం

రైల్వే పనుల కోసం గ్రావెల్ తవ్వకాలకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. సర్వే నంబరు 90-8లోని జిరాయతీ పొలం చదును కోసం దరఖాస్తు చేసుకున్నారు. సర్వే నంబరు 42లోని ప్రభుత్వ భూమిలో తవ్వకాలు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తాం. మాకు సమాచారం అందడంతో విఆర్ఒలు వెళ్లి పరిశీలించగా అక్కడ తవ్వకాలు జరిగినట్లుగా గుర్తించాం.

- ఆర్.వెంకటేష్ రామానుజులు
తహశీల్దార్, పొందూరు

మూలపేటలో ప్లాస్టిక్ పరిశ్రమ

స్థల పరిశీలన చేసిన అమెరికా కంపెనీ

ప్రజాశక్తి - నౌపడ

స్థల పరిశీలన చేస్తున్న కంపెనీ ప్రతినిధులు, అధికారులు

సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు సమీపంలో ఎగ్జాన్‌మొబిల్ ప్లాస్టిక్ పరిశ్రమ స్థాపనకు అనువైన స్థలాన్ని గుర్తించేందుకు అమెరికా కంపెనీ ప్రతినిధుల బృందం శుక్రవారం పర్యటించింది. గ్రోత్ వెంచర్స్ ఆపర్చునిటీ మేనేజర్ జాయ్ వెస్ట్‌కాట్, సప్లై చైన్ మేనేజర్ సే లింలా, ప్రాజెక్టు ఇంజినీరు డి.పి ప్రసన్న, ఫెసిలిటీ ఇంజినీర్ శ్రీజ్ రామచంద్రన్‌తో కూడిన బృందానికి టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి వివరాలు అందించారు. ఈ పరిశ్రమ కోసం 1250 ఎకరాల స్థలం అవసరమని, దీని విలువ సుమారు రూ.83,500 కోట్లు ఉంటుందని అధికారులు చెప్పారు. ఈ ప్లాంట్‌లో పాలీ ఇథిలిన్, పాలీ ప్రొపిలిన్ వంటి ఉత్పత్తులు చేయనున్నట్లు తెలిపారు. పోర్టు నిర్మాణం, రోడ్డు, రైల్వే లింకులు, పరిసర ప్రాంత భూముల వివరాలను బృంద సభ్యులు అడిగి తెలుసుకున్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మూలపేట పోర్టు అభివృద్ధి దశలను అధికారులు వారికి వివరించారు. పోర్టు పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. అనంతరం కంపెనీ ప్రతినిధుల బృందం శ్రీకాకుళంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎపి ఇడిబి ప్రతినిధి రంజిత్ కుమార్, సంతబొమ్మాళి తహశీల్దార్ హేమసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ద్వారా విస్తృత సేవలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా విస్తృత సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం, అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి విపత్తుల సమయంలో రెడ్‌క్రాస్ సేవలందిస్తుందన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా రక్తం సేకరించి అవసరమైన వారికి అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో తలసేమియా ఉన్న 28 మందిని గుర్తించి వారికి రక్తం సరఫరా చేస్తున్నట్లు వివరించారు. సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సొసైటీకి రాష్ట్రస్థాయిలో మంచి పేరు ఉందన్నారు. మొక్కలు నాటే కార్యక్రమం ఈ ఏడాది జిల్లాలో పెద్దఎత్తున చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర రెడ్‌క్రాస్ ద్వారా వచ్చే నెల 9వ తేదీన కలెక్టర్ అవార్డు అందుకోనున్నారని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పి.జగన్మోహనరావు వెల్లడించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా అందించిన సేవలను వివరించారు. రక్తదానానికి సహకరించిన పలు స్వచ్ఛంద సంస్థలు, జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలకు మెమోంటోలతో సన్మానించారు.

తొలుత రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు జాన్ హెన్రీ డూనాంట్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ ఏడాదిలో జిల్లా రెడ్‌క్రాస్ అందించిన సేవలు, రక్త సేకరణకు సంబంధించి ఫొటో ప్రదర్శనను తిలకించారు. బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా ఉపాధ్యక్షులు కె.సుధీకర్, కోశాధికారి కె.దుర్గారావు, ఎజిఎం పరిశీలకులు ఎం.శ్రీరాములు, పెంకి చైతన్యకుమార్, కె.సత్యనారాయణ, ఆర్ట్స్ సంస్థ ప్రతినిధి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

శ్రీకాకుళం సిటీ : లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, పని గంటలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూలై 9వ తేదీన అఖిల భారత సమ్మెలో భాగస్వామ్యమవుతున్నట్లు సమ్మె నోటీసును శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావుకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆప్కాస్ ఉద్యోగి అనే పదాన్ని తొలగించి మున్సిపల్ కార్మికులందరికీ (ఇంజినీరింగ్, పారిశుధ్య) తల్లికి వందనంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇతర సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. గతంలో 17 రోజుల సమ్మె సందర్భంగా ప్రతిపక్ష నేతగా చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలన్నీ ఎలాంటి షరతుల్లేకుండా అమలు చేస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మంచి జరుగుతుందని కార్మికులు, ప్రజలు ఆశించారని, అందుకు భిన్నంగా ప్రభుత్వ విధానాలు అవలంభిస్తోందన్నారు. కార్మికులకు ఇన్సూరెన్స్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. పర్మినెంట్ కార్మికులకు రెండో శనివారం, జాతీయ సెలవులు అమలు చేయాలన్నారు. 60 ఏళ్లు పూర్తయిన, చనిపోయిన కార్మిక కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, కమిటీ సభ్యులు ఎ.మోహన్, ఆర్.యుగంధర్, వేణు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పిఎం ఉషా నిధులు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

సమావేశంలో పాల్గొన్న బిఆర్ఎయు అధికారులు

ఉన్నత విద్యాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ప్రధానమంత్రి ఉచ్చతర శిక్షా అభియాన్ (పిఎం - ఉషా) నిధులను వినియోగించాలని కేంద్ర విద్యాశాఖ అదనపు కార్యదర్శి ఎస్.కె భర్నవాల్ సూచించారు. పిఎం-ఉషా పథకానికి ఎంపికైన దేశంలోని పలు యూనివర్శిటీల వైస్ ఛాన్సలర్లు, అధికారులతో న్యూఢిల్లీ నుంచి వర్చువల్ విధానంలో శుక్రవారం మాట్లాడారు. బోధన, పరిశోధన, నూతన నిర్మాణాలు, లేబొరేటరీలు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు, క్రీడా మైదానాల ఏర్పాటు వంటి వాటికి ఈ నిధులను అధికంగా వెచ్చించాలని సూచించారు. 2023లో ప్రారంభించిన రూసా పథకం ద్వారా దేశంలో అనేక యూనివర్శిటీలు ప్రగతి పట్టాలు అందుకున్నాయన్నారు. నిర్దిష్ట సమయంలో ఈ నిధులు సద్వినియోగం చేసుకోకపోతే తదుపరి విడత గ్రాంట్ మంజూరు కాదని తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ కె.ఆర్ రజని మాట్లాడుతూ రెండో విడతలో పిఎం-ఉషా పథకానికి అర్హత సాధించిన దేశంలోని 12 యూనివర్శిటీల్లో బిఆర్ఎయు ఒకటి అని తెలిపారు. వర్శిటీ పంపిన సమగ్ర నివేదికకు ఈనెల 21వ తేదీన పూర్తిస్థాయి ఆమోదం లభించిందన్నారు. ఈ నిధుల వినియోగానికి ఇప్పటికే ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. సమావేశంలో పిఎం-ఉషా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణ భరత్ అమరావతి నుంచి పాల్గొనగా, బిఆర్ఎయు నుంచి రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఉదయ్‌భాస్కర్, ఎస్ఒ కె.సామ్రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

మంత్రికి సమస్యలు వివరిస్తున్న కుట్టు శిక్షణా కేంద్రం మహిళలు

మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెట్టిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు వెళ్తున్న మంత్రికి సరుబుజ్జిలి మండల కేంద్రంలో డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సరుబుజ్జిలి గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణా కేంద్రాన్ని శుక్రవారం సందర్శించి మహిళలతో మంత్రి మాట్లాడారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి శిక్షణ ప్రారంభించడం వల్ల గృహావసరాల దృష్ట్యా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సమయపాలనలో మార్పులు చేయాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి బిసి కార్పొరేషన్ ఇడి ఆర్.గడ్డెమ్మతో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ధవళ సింహాచలం, బస్వా ఉమామహేశ్వరరావు, గుర్రాల చినబాబు, సురేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

మందస ఎంఇఒపై చర్యలు తీసుకోవాలి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఉన్నత విద్యాశాఖ అధికారుల ఉత్తర్వులను మందస మండల విద్యాశాఖ అధికారి ఏమాత్రం పాటించకుండా మండలంలో ఒక్క ప్రాథమికోన్నత పాఠశాల కూడా లేకుండా పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ చేయడాన్ని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ తప్పుపట్టారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్యను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పలు ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆరు, ఏడు తరగతుల్లో విద్యార్థులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరం మేరకు ఉన్నా ఆ పాఠశాలల కుదింపులో మండల విద్యాశాఖ అధికారి చేతివాటం ప్రదర్శించడాన్ని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి తప్పుపట్టారు. మండలంలోని నారాయణపురం పాఠశాలలో 6, 7, 8 తరగతుల విద్యార్థులు 52, బుడారిసింగిలో 44, హొన్నాలి 44, సరియాపల్లిలో 37, సువర్ణపురంలో 31, కొడారిబడిలో 33 ఉన్నా ఆ పాఠశాలలను డౌన్ గ్రేడ్ చేయడం మండల విద్యాశాఖ అధికారి బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని, సమగ్ర దర్యాప్తు చేసి ఆయనపై వెంటనే చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల బదిలీల సందర్భంగా కొంతమంది ఉపాధ్యాయుల రిలీవింగ్‌లో ఉత్పన్నమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. గతంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమాన్ని పాల్గొన్న ఉపాధ్యాయులకు నిధులు విడుదల చేయాలని, రాబోయే రోజుల్లో శిక్షణా కార్యక్రమాలను నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి బి.రవికుమార్, జిల్లా కార్యదర్శి గున్న రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ జి.కోదండరావు, జిల్లా నాయకులు జగదీష్, ఎల్.కోదండరామయ్య తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమానికి కృషి

కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఎయిర్‌పోర్టు అథారిటీ అఫ్ ఇండియా ఆధ్వర్యాన నగరంలోని ఒక హోటల్‌లో వికలాంగులకు శుక్రవారం ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా సిఎస్ఆర్‌లో భాగంగా అలీంకో సంస్థ సహకారంతో రూ.3.20 కోట్లతో 43 రకాలకు చెందిన 1230 పరికరాలను 800 మంది వికలాంగులకు పంపిణీ చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక వికలాంగుల పింఛన్‌ను రూ.ఆరు వేలకు పెంచినట్లు తెలిపారు. ప్రతి మూడో శుక్రవారం వికలాంగుల కోసం స్వాభిమాన్ పేరుతో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వికలాంగులకు ఏదో ఒక కార్యక్రమం చేయాలన్న తపన తనకు ఉండేదని, అందులో భాగంగా జిల్లాలో జనవరిలో ప్రత్యేకంగా ఐడెంటిఫికేషన్ క్యాంపులు పెట్టామన్నారు. ఆ క్యాంపుల్లో గుర్తించిన వారికి హియరింగ్ ఎక్విప్‌మెంట్ వాకింగ్ ఎయిడ్స్, క్రచెస్, వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు అందజేస్తున్నట్లు తెలిపారు. బ్రెస్ట్ కేన్సర్‌పై గ్రామీణ ప్రాంతాల్లోనూ అవగాహన కల్పించి, మహిళలు ఎప్పటికప్పుడు పరీక్షలు చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 10 ప్రాంతాలలో క్యాంపులు పెట్టి పది వేల మందికి స్క్రీనింగ్ చేయబోతున్నామని చెప్పారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ, వికలాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 80 శాతం అంగవైకల్యం ఉన్న వారికి బ్యాటరీ ట్రైసైకిల్స్ అందజేయడమైందని, ఇప్పుడు 60 నుంచి 80 శాతం ఉన్న వారికీ ఇస్తున్నామన్నారు. భవిష్యత్‌లో 40 శాతం ఉన్న వికలాంగులకూ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, పౌర విమానయాన సంస్థ చైర్మన్ విపిన్ కుమార్, హెచ్‌ఆర్ మెంబర్ హెచ్.శ్రీనివాస్, జనరల్ మేనేజర్ సంజయ్ సింగ్, ఇండియా టర్న్ పింక్ సంస్థ ఫౌండర్ ఆనంద్ కుమార్, డిసిఎంఎస్, డిసిసిబి చైర్మన్లు చౌదరి అవినాష్, ఎస్.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్వేతశ్రీని అభినందిస్తున్న ట్రిపుల్ ఐటి డైరెక్టర్ బాలాజీ

'గేట్'లో శ్వేతశ్రీకి 241వ ర్యాంకు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండల పరిధిలోని ఉన్న ట్రిపుల్ ఐటి సిఎస్ఇ విద్యార్థిని కొమరాల శ్వేతశ్రీ గేట్‌లో 241వ ర్యాంకు సాధించడంతో కళాశాల డైరెక్టర్ బాలాజీ అభినందించారు. ఉన్నత స్థాయిలో చదివి ఉన్నతమైన స్థాయికి చేరుకోవాలని యూనివర్శిటీకి మంచి పేరు తీసుకురావాలన్నారు. శ్వేత శ్రీది పల్నాడు జిల్లా దుగ్గి గ్రామం. తల్లిదండ్రులు ఆదినారాయణ, అరుణ. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి మంచి ఉన్నతమైన ర్యాంక్ సాధించడంతో తల్లిదండ్రులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, వెల్ఫేర్ డీన్ డాక్టర్ రవి గేదెల, మోహన్ కృష చౌదరి, క్యాంపస్ 2 ఇన్‌ఛార్జి సాగర్, అధ్యాపకులు కోడా దిలీప్ కుమార్, నూకేశ్వరరావు, డాక్టర్ రాకోటి శ్రీనివాసరావు, డాక్టర్ గణేష్ మళ్లా, తేజ కిరణ్, సింహాచలం, అధ్యాపకులు అభినందిచారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

ప్రతి కార్యకర్త గడప గడపకు వెళ్లాలి

ప్రజాశక్తి- పాతపట్నం

ప్రతి కార్యకర్త గడపగడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే గృహం వద్ద కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఇప్పటివరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన, అమలు చేసిన సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలు, చేపట్టబోయే కార్యక్రమాలపై డోర్ టు డోర్ క్యాంపైనింగ్ ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సందర్శించిన ఇళ్లను నమోదు చేయడానికి టిడిపి తరపున మై టిడిపి అనే యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారుని, ఈ యాప్ ఉపయోగించే విధానాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఐదు మండలాల టిడిపి మండల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న తేజబాబు

పలువురికి రెడ్‌క్రాస్ అవార్డులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని పూజారిపేటలో ఉన్న కృత్విక్ ఫౌండేషన్‌కు రెడ్‌క్రాస్ అవార్డు దక్కింది. చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) కృతిక్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా రెండు బ్లడ్ క్యాంపులు నిర్వహించి 170 యూనిట్లు రక్తాన్ని స్వచ్ఛందంగా రెడ్‌క్రాస్ సంస్థకు అందించడంతో గుర్తించిన రెడ్‌క్రాస్ సంస్థ శుక్రవారం శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకటేష్‌కు ప్రశంసాపత్రం, అవార్డు అందించారు. జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండర్కర్, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పి. జగన్మోహన రావు, కార్యదర్శి కె.దుర్గా శ్రీనివాస్ చిన్నును అభినందించారు.

రణస్థలం రూరల్: జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉత్తమ సేవలకుగాను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేతులమీదుగా శ్రీమహాలక్ష్మి యూత్ అధ్యక్షులు నడుకుదిటి తేజబాబు ప్రశంసాపత్రం, మెమోంటోను అందుకున్నారు. అక్టోబర్ 2 గాంధీ జయంతిని పురస్కరించుకొని రికార్డుస్థాయిలో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించిన తేజబాబును ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వసంత కుమార్

గిరిజన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి- పలాస

గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిడిఒ కె.వసంత కుమార్ అన్నారు. మండలం లొత్తూరులో శుక్రవారం జుగా (ప్రధాన మంత్రి జన జాతీయ ఉన్నత్ గ్రామ అభియాన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. గిరిజన గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడమే జుగా ముఖ్య ఉద్దేశమన్నారు. గిరిజన యువతకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి జీవనోపాధి కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, సర్పంచ్ సవర పద్మ, సవర సీమాన్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లత, సిసి నాగమ్మ, ఎపిఒ శంకరరావు, హౌసింగ్ ఎఇ మణికంఠ, వైద్యాధికారి సునీల్, సవర మోహనరావు పాల్గొన్నారు.

ఐవిఆర్ఎస్‌పై ఇంటింటి సర్వే

కోటబొమ్మాళి: మండలంలోని అన్ని పంచాయతీల్లో ఐవిఆర్ఎస్ సర్వే కార్యదర్శుల ద్వారా ఇంటింటా నిర్వహిస్తున్నామని డిప్యూటీ ఎంపిడిఒ జె.అనందరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని రేగులపాడు, సౌడాం పంచాయతీల్లో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. పారిశుధ్య కార్మికులు గ్రామంలో పని చేస్తున్నది లేనది ఇంటింటికి వెళ్లి తెలుసుకుంటున్నామన్నారు. ఐవిఆర్ఎస్ నుంచి ఏదైన సమాచారం వస్తే తప్పనిసరిగా సమాధానాలు చెప్పాలన్నారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, ప్రభుత్వం నిర్ధేశించిన ఈ కార్యక్రమాన్ని ఎలాంటి అలసత్వం వహించకుండా కార్యదర్శులు చిద్దశుద్ధితో చేయాలన్నారు. కార్యదర్శి భాస్కరరావు, పల్లి శ్రీను పాల్గొన్నారు.

సర్వే నిర్వహిస్తున్న కార్యదర్శులు

మా పాఠశాలను తరలించొద్దు

ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని గాజుల కొల్లివలసలో ఉన్న మండల ప్రాథమిక పాఠశాలను పక్కనే ఉన్న ఆర్అండ్ఆర్ కాలనీలో ఉన్న పాఠశాలలో విలీనం చేయొద్దని గ్రామ సర్పంచ్ ప్రతినిధి మొండేటి కూర్మారావు ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు ప్రజాదర్బార్‌లో వినతిపత్రం అందించారు. శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి పలు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా గాజుల కొల్లివలస పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలను తరలించ వద్దంటూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. 30 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలను 3, 4, 5 తరగతుల్లో కేవలం ఆరుగురు విద్యార్థులున్న ఆర్అండ్ఆర్ కాలనీ పాఠశాలలో మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్చి అందులో విలీనం చేయొద్దన్నారు. పాఠశాల విలీనాన్ని నిలుపుదల చేసి న్యాయం చేయాలని విద్యా కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఏప్రిల్ 12న ఎంఇఒకు సమర్పించినప్పటికీ ఎటువంటి సమావేశం ఏర్పాటు చేయకుండా పాఠశాలను విలీనం చేశారని ఎమ్మెల్యే దృష్టికి విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకువచ్చారు. ఎక్కువమంది విద్యార్థులు ఉన్న గాజుల కొల్లివలస పాఠశాలలో ఆర్అండ్ఆర్ కాలనీ పాఠశాలను విలీనం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే పట్టణంలోని 13వ వార్డు పరిధిలో ఉన్న సాయినగర్ ప్రజలు నూతన సిసి రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి రహదారి నిర్మించాలని వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, కూన ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

శ్రీకాకుళం రూరల్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలిపితే అధికారుల సమక్షంలోనే తక్షణ పరిష్కారం చేపడతామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మంచినీరు, పెన్షన్, రేషన్, హౌసింగ్, మున్సిపల్ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులకు తక్షణమే చర్యలు తీసుకున్నారు. తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, గార మండల అధికారులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్‌ను శుక్రవారం ఎచ్చెర్ల ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు వచ్చిన అర్జీలను ఎంపిడిఒ, తహశీల్దార్‌కు పంపి పరిష్కారం కోసం ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో పూర్వపు టిడిపి జిల్లా అధ్యక్షులు చౌదరి బాబ్జి, టిడిపి మండల అధ్యక్షులు బెండు మల్లేశ్వేరావు, నియోజకవర్గ కో- కన్వీనర్ సంపతరావు నాగేశ్వరరావు, సనపల రామారావు, జనసేన మండల అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాస్, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పంటలు పరిశీలన

ప్రజాశక్తి- కొత్తూరు

మండలం లబ్బ యూనిట్‌లో బాంద్రగూడ మారుమూల గిరిజన గ్రామంలో స్టేట్ రీజనల్ టీమ్ సందర్శనలో భాగంగా నవధాన్యాల సాగును పరిశీలించారు. అలాగే పత్తి పంటలో అంతర పంటలు ఎలా వేసుకోవాలో సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమమంలో హేమసుందరావు, ప్రకాశరావు, దేవుళ్లు, డివిజన్ ఎంటి సూర్యనారాయణ, యూనిట్ ఇన్‌ఛార్జి చిన్నమ్మి, ఐసిఆర్‌పి ఆనందరావు పాల్గొన్నారు.

సమ్మెనోటీసు అందజేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

కనీస వేతనాలు అమలు చేయాలి

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో శుక్రవారం జూలై 9న కేంద్ర కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మెకు పిలుపులో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఇఒ చెరుకుపల్లి సత్యంకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం సంఘం నాయకులు పి.భూదేవి పాత్రో, వై.మణమ్మ, బి శశిరేఖ, కృష్ణవేణి, బి.శకుంతల, ఎం.అప్పాయమ్మ పాల్గొన్నారు.

ఎడిఎగా భవానీ శంకరరావు బాధ్యతలు

సోంపేట: సోంపేట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులుగా టి.భవానీ శంకరరావు బాధ్యతలు స్వీకరించారు. జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎడిఎగా పనిచేసిన జగన్మోహనరావు బదిలీపై టెక్కలి వెళ్లారు. స్థానిక వ్యవసాయ శాఖ సిబ్బంది భవాని శంకరరావుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు.

పశువైద్యాధికారిగా సతీష్ కుమార్

ప్రజాశక్తి- బూర్జ

సతీష్‌కుమార్

మండలంలోని గుత్తావల్లి పశు వైద్యాధికారిగా డాక్టర్ సతీష్ కుమార్ విధుల్లో చేరారు. గతంలో పనిచేసిన వైద్యాధికారి డాక్టర్ శ్రావణి బదిలీపై వెళ్లగా, సతీష్ కుమార్ గతంలో పురుషోత్తపురం పశువైద్యాధికారిగా వైద్య సేవలు అందించారు. బదిలీపై బూర్జ మండలం గుత్తావల్లిలో విధుల్లో చేరారు.

కలమట పరామర్శ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పెద్దలక్ష్మీపురం గ్రామానికి చెందిన బూర్ల చిన్నమ్మి ఇటీవల మరణించడంతో వారి కుటుంబాన్ని జిల్లా టిడిపి అధ్యక్షులు కలమట వెంకటరమణమూర్తి శుక్రవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు మండల టిడిపి అధ్యక్షులు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బసవ పరమేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ బూర్ల లలిత కుమారి, మడపాల బైరాగి, శశిభూషణరావు, ఋషికేశ్వరరావు, జంకుడు రామారావు, గురండి మధు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- బూర్జ

డొంకపర్త గ్రామంలో సీనియర్ టిడిపి నాయకులు జడ్డు కృష్ణకు ఇటీవలే అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చేర్పించగా శుక్రవారం కృష్ణను ఆ గ్రామంలో ఎమ్మెల్యే పరామర్శించారు. ఈయనతో పాటు డిసిసిబి చైర్మన్ సువ్వారి సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వ ప్రసాదరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ రామకృష్ణ నాయుడు, బూర్జ ఎంపిటిసి సిహెచ్ పోలినాయుడు, బొల్లి సూరిబాబు, గిరి మనోజ్ కుమార్ తదితరులున్నారు.

ఎడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

పశుసంవర్ధకశాఖ ఎడిగా నరసింహులు

టెక్కలి రూరల్: టెక్కలి డివిజన్ ఉపసంచాలకులుగా డాక్టర్ సిహెచ్ నరసింహులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పాడేరు డివిజన్ నుంచి డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీపై టెక్కలి వచ్చారు. ఇక్కడ పనిచేసిన డాక్టర్ వి.జయరాజు పాడేరు బదిలీపై వెళ్లారు. ఈయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సిబ్బంది డాక్టర్ ఎస్.శిరీష, డాక్టర్ ఎం.పాపారావు, సూపరింటెండెంట్ ఎస్ బీర్జన్, సీనియర్ అసిస్టెంట్ ఎస్.గోవింద్, జూనియర్ అసిస్టెంట్ కె.రూప, కంప్యూటర్ ఆపరేటర్ కె.గోవిందరావు, ఎస్.రామచంద్రరావు, దుర్గాప్రసాద్, సంతోష్, సిబ్బంది లక్ష్మీ, పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శుక్రవారం నరసన్నపేట రోడ్లు భవనాలు శాఖ అతిథి గృహాన్ని సందర్శించారు. నరసన్నపేట పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి జరిగేలా చూడాలని సూచించారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. పర్యవరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, దీనిపై అటవీశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపిడిఒ ప్రసాదరావు, డిఇ తిరుపతిరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట : మొక్కలు నాటుతున్న కేంద్రమంత్రి, కలెక్టర్

ఇచ్ఛాపురం: నాడు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మండల మహిళా సమైక్య వెలుగు ఆఫీస్, ఎన్ఆర్ఇజిఎస్ కార్యాలయం ఆవరణలో, అలాగే ప్రతి పంచాయతీలోనూ గ్రామ సంఘాల్లోనూ స్థానిక ప్రజాప్రతినిధులు, సిబ్బంది మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎపిఎం పి.శ్రీనివాసరావు, ఎపిఒ, ఎన్ఆర్ఇజిఎస్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇసిలు, సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

నందిగాం : మొక్కలతోనే ఆరోగ్యమైన జీవితం లభిస్తుందని మండల ప్రత్యేక అధికారి ఐవి రమణ అన్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కుమార్ పట్నాయక్, డిప్యూటీ ఎంపిడిఒ రాజారావు, సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గిరిజనులు

శ్మశానవాటిక స్థలం మార్చుచేయాలి

పలాస: ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణానికి తమ భూములు త్యాగం చేస్తే రామకృష్ణాపురం ఆర్అండ్ఆర్ కాలనీ వద్ద నివాస గృహాల సమీపంలో శ్మశాన వాటికను కేటాయించడం దారుణమని, తక్షణమే శ్మశాన వాటికను వేరే చోటకు మార్చాలని ఆదివాసీసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరహాల కృష్ణారావు, నందిగాం మండలం చిన్న గురువూరుకు చెందిన గిరిజనులు వరహాల నీలయ్య, మొరేసు గణపతి, యర్ర భువనేశ్వరి, వరాహాల అనసూయ, వరహాల రమేష్, బొడ్డపాటి కేశ్వరరావు, వరహాల అన్నపూర్ణ డిమాండ్ చేస్తున్నారు. పలాస మండలం రామకృష్ణాపురం ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్వాసితుల కాలనీలో కేటాయించిన శ్మశాన వాటికను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రామకిష్ణాపురం ఆర్అండ్ఆర్ కాలనీలో వేరేచోట శ్మశాన వాటికను ఏర్పాటు చేసి ఇప్పుడు నివాస గృహాల సమీపంలో ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆర్అండ్ఆర్ కాలనీలో స్థలాలు కేటాయించినప్పుడే చిన్న గురువూరుకు చెందిన గిరిజనులకు మందిర స్థలం, శ్మశాన వాటిక స్థలం కేటాయించాలని కోరామని తెలిపారు. అందుకు అధికారులు అంగీకరించారని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. ఇదే విషయాన్ని తహశీల్దార్, పలాస ఆర్‌డిఒ దృష్టికి తీసుకువెళ్ళినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనులు కావడంతో అధికారులు చిన్న చూపు చూస్తూ ఇష్టారాజ్యంగా శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే శ్మశాన వాటికను నివాస గృహాలకు దూరంగా స్థలాన్ని కేటాయించాలని కోరారు.

కార్యకర్తలే కీలకం

రణస్థలం: రణస్థలం క్యాంపు కార్యాలయంలో రావాడ పంచాయితీ కార్యకర్తలతో 'కార్యకర్తే కీలకం' సమావేశంలో భాగంగా శుక్రవారం కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్త ఉంటేనే పార్టీకి మనుగడ ఉంటుందన్నారు. పార్టీలో ప్రతీ కార్యకర్త సమన్వయం చేసుకుంటూ పార్టీని బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలన్నారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత పటిష్టంగా బలపరిచి ప్రజలకు అండగా నిలబడాలన్నారు. కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలకు అనుగుణంగా వైసిపి అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి చేపట్టబోతున్న కార్యక్రమం బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ పేరుతో రీ కాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టో చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో, నియోజకవర్గ స్థాయిలో, మండల స్థాయిలో, గ్రామస్థాయిలో రచ్చబండ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చంద్రబాబు ప్రజలకిచ్చిన హామీలు విస్మరించి పాలన సాగించడం, సంక్షేమ పథకాలు ఎగ్గొట్టి ప్రజలకు ఎంత బకాయిలు పడ్డారనేది, దీనిపై ప్రజలను చైతన్యపరచడంపై విస్తృతస్థాయి సమావేశంలో వీడియోల రూపంలో అర్థమయ్యే విధంగా వివరించాలన్నారు. గ్రామ కమిటీలను త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామ కమిటీలను పూర్తిచేస్తేనే ప్రజలకు చంద్రబాబు మోసాలను వివరించడం సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు, ఎచ్చెర్ల నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు దన్నాన హరి, ఎచ్చెర్ల నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు మజ్జి రమేష్, ఎంపిటిసి ప్రతినిధి కిల్లారి సూర్యనారాయణ, మాజీ ఎఫ్ఎస్‌సిఎస్ అధ్యక్షులు కిల్లారి రమణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

టిడిపి నూతన కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం : నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న విప్ అశోక్

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణ టిడిపి నూతన కార్యవర్గం ఎట్టకేలకు అధికారికంగా ప్రకటించారు. నూతన కార్యవర్గం సభ్యులను ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాలం అశోక్ అభినందించారు. పార్టీ బలోపేతానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని సూచించారు. పట్టణ అధ్యక్షుడుగా పత్రి తవిటియ్య, ప్రధాన కార్యదర్శిగా నందిగాం కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బత్తిన కృష్ణయ్యను ఎన్నుకున్నారు. అదేవిధంగా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నీలపు వెంకటరెడ్డి, దట్టి శ్రీను, ఆసి మోహన్, సెక్రటరీగా శాసనం శేఖర్, పైలనారాయణ, బచ్చు సత్యరెడ్డి, కోశాధికారిగా గొర్ల నాగరాజును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాళ్ల జయదేవ్, నందిక జాని, కాళ్ల దిలీప్ కుమార్, లీలా రాణి, కొండ శంకర్ రెడ్డి, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: టిడిపి కేంద్ర కార్యాలయ ఆదేశాల మేరకు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆధ్వర్యంలో బూర్జ మండలంలో శుక్రవారం టిడిపి సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వావిలపల్లి సీతారాం బాబును బూర్జ మండల టిడిపి అధ్యక్షునిగా నియమించారు. ఉపాధ్యక్షుడుగా పిల్లా కన్నన్నాయుడు, ప్రధాన కార్యదర్శిగా హనుమంతు గోపి మాస్టర్ నియమితులయ్యారు. కార్యనిర్వాహక కార్యదర్శులుగా గేదెల నవీన్, కొయ్యాన సూర్యనారాయణ, బెవర రామారావులను ఎంపిక చేశారు. కార్యదర్శులుగా జడ్డు కృష్ణ సూరి, అనంతగిరి నున్నగొప్పల వాసుదేవరావులను నియమించగా, కోశాధికారిగా బుడుమూరు సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు.

వైభవంగా జగన్నాథస్వామి రథయాత్ర

దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి - బూర్జ

మండల కేంద్రంలో గురు వారం జరిగిన జగన్నాథ స్వామి యాత్రను ఎమ్మెల్యే కూన రవికుమార్ సందర్శించారు. వందేళ్ల చరిత్ర గల పాత రథం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ ఏడాది రూ.20 లక్షలతో కొత్త రథాన్ని ప్రారంభించినట్టు ఆయన తెలిపారు.

ఇచ్ఛాపురం: జగన్నాథ స్వామి రథయాత్ర అత్యంత ఘనంగా జరిగింది. ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాలం అశోక్ రథయాత్ర ఉత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ ఎస్ఐ ముకుంధరావు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

జగన్నాథ స్వామి రథయాత్రలో పాల్గొన్న ప్రభుత్వ విప్ అశోక్

మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మోహనరావు (ఫైల్)

మండలంలోని సింగుపురం మాజీ సర్పంచ్ గుండ మోహనరావు (70) గురువారం మృతి చెందా రు. మోహన్ గతంలో సింగుపురం సర్పంచ్‌గా అనేక సేవలు అందించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మోహన్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. మాజీ మంత్రి, వైసిపి నాయకులు ధర్మాన ప్రసాదరావు మోహన్ మృతిపై ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- పలాస

చినబడాం, అంతరకుడ్డ గ్రామాల మధ్య శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వజ్రపుకొత్తూరు గ్రామానికి చెందిన కె.సూర్యారావుకు తలపై తీవ్ర గాయమైంది. సూర్యారావు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పశువులు అడ్డంగా రావడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటన జరిగిన వెంటనే 108 సిబ్బంది సత్యం, శ్రీనివాసరావు క్షతగాత్రుడుకు ప్రథమ చికిత్స అందించి పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

మాజీ జెడ్‌పిటిసికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలం మాజీ జెడ్‌పిటిసి గొర్లె లక్ష్మణరావు శుక్రవారం రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలయ్యారు. ఎచ్చెర్లలో ఎమ్మెల్యే ఈశ్వరరావు నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు శ్రీకాకుళం నుంచి ఎచ్చెర్ల బస్సులో వచ్చిన లక్ష్మణరావును గ్రీవెన్స్ జరుగుతున్న చోటుకు రోడ్‌క్రాస్ చేస్తుండగా ఆటో ఢీకొనడంతో తలకు బలమైన గాయమై తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆయనను శ్రీకాకుళం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో అత్యవసర చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే కిమ్స్ ఆస్పత్రికి చేరుకొని వైద్యులతో మాట్లాడి గాయపడ్డ లక్ష్మణరావుకు అవసరమైన వైద్యం అందించాలని కోరారు. ఎమ్మెల్యేతో పాటు కూటమి నాయకులు పైడి వేణుగోపాలం, చౌదరి నారాయణ మూర్తి, లెంక శ్యామలరావు, పిసిని జగన్నాథం నాయుడు, ఎస్. నాగేశ్వరరావు, బెండు మల్లేశ్వరరావు తదితరులున్నారు.

ఆపదలో ఆదుకున్న హెల్పింగ్ హేండ్స్

ప్రజాశక్తి- కవిటి

జీవితమొక సందిగ్ధపు అంచున నిలిచిన సమయంలో ఓ మనసున్న మనిషి చేయి అందించాడంటే అతను ఓ మానవీయ శక్తి అనిపించకమానదు. అలాంటి సంఘటనే ఇక్కడ జరిగింది. కవిటి మండలం కుసుంపురం గ్రామానికి చెందిన తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారి కీలు సింధు అనారోగ్యంతో సోంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వైద్యులు ఓ పాజిటివ్ రక్తం తక్షణం అవసరమని చెప్పడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ సమాచారాన్ని హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు విశ్వేశ్వరరావు తెలుసుకొని స్పందించారు. తన సహచరుడు, సంస్థ సభ్యుడు కళింగపట్నం గ్రామానికి చెందిన తన స్నేహితుడు వెంకటేష్‌కు సమాచారం ఇచ్చి, ఆస్పత్రికి పంపించారు. వెంకటేష్ పాపకు అవసరమైన రక్తాన్ని సమకూర్చి చికిత్సకు కీలకమైన సహాయం చేశారు. దీంతో పాప చికిత్స కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆపద సమయంలో స్పందించిన వెంకటేష్, విశ్వేశ్వరరావులకు, హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థకు చిన్నారి కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

ఆదాయపన్ను రిటర్న్స్‌పై అవగాహన

ప్రజాశక్తి- పొందూరు

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆదాయ పన్ను రిటర్న్స్ ఫైలింగ్‌పై, ట్రెజరీకి సమర్పించాల్సిన బిల్లులపై శుక్రవారం పొందూరు, జి.సిగడాం మండలాలకు చెందిన డిడిఒలకు సమీక్ష, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాకుళం ఆదాయపు పన్ను అధికారులు డిడిఒలకు అవగాహన కల్పించారు. 24జి ప్రకారం ప్రతినెలా 15లోగా ఆదాయపు పన్ను పరిధిలోకి వచ్చే అధికారుల రిటర్న్స్ ఫైలింగ్ చేయడంలో డిఫాల్టర్లు అయిన డిడిఒలకు 16వ తేదీ నుంచి రూ.200 నుంచి రూ.500 వరకు ఫెనాల్టీ పడుతుందని అప్రమత్తం చేశారు. సిఎఫ్ఎంఎస్ పోర్టర్, నిధి పోర్టర్ లేటెస్ట్ ప్రొవిజన్ మ్యాపింగ్, బిల్స్ సబ్మిట్ చేయడంలో పొరపాట్లుపై అవగాహన కల్పించారు. జిఒ 15, 12 ప్రకారం సమర్పించాల్సిన బిల్లులను సూచించిన తేదీల్లోనే సమర్పించాలని ట్రెజరీ అధికారులు సూచించారు. ఈ సమీక్షలో ఆదాయపు పన్ను అధికారులు ఐటిఒ చంద్రశేఖర్ ప్రధాన్, టిఎ ఎర్నిబాబు సోపేటి, ఎంటిఎస్ సుప్రజిత్ బెనర్జీ, ఎస్‌టిఒ ఎం.తులసిరావు, డిఎల్ఒ శ్రీనివాసరావు, ఎస్ఎ రమణమ్మ, జెఎ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐటిఒ చంద్రశేఖర ప్రదాన్

మహారాజశ్రీ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S. 27/2017
Between:
పులగం నారాయణ రెడ్డి ...వాది
మరియు
చంద్రశేఖరుని ఉదయ్ శ్యామ్ కుమార్ ...ప్రతివాది
To,
చంద్రశేఖరుని ఉదయ్ శ్యామ్ కుమార్, S/o. దుర్గ ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్, R&B సెక్షన్ ఆఫీస్, టెక్కలి, టెక్కలి మండలం, శ్రీకాకుళం జిల్లా.
పై నెంబరు దావాలో వాది గారు మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు పంపినను, మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున ది.03-07-2025న ఉదయం 10.30 ని॥లకు మీరు తూర్పు గోదావరి జిల్లా, అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు కావలెను. లేని పక్షంలో మీ పరోక్షంలో కోర్టు వారు తగు నిర్ణయం తీసుకుందురనీ ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియచేయడం అయినది.
(శ్రీ కోర్టు వారు ఉత్తర్వులను అనుసరించి)
R.V.G. పట్నాయక్
వాది తరపు అడ్వకేట్
అనపర్తి, తూ॥గో॥ జిల్లా.
అనపర్తి
ది.26-06-2025

లబ్ధిదారులను గుర్తించాలి

ప్రజాశక్తి- పాతపట్నం

ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతిలో పశుగ్రాస పెంపకానికి ప్రతి గ్రామంలో చర్యలు చేపట్టాలని ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక పశువైద్యశాలలో పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పశువైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతిలో పశుగ్రాస పెంపకానికి గ్రామాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి, వారితో పశుగ్రాసం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా అమలు చేస్తున్న పశుగ్రాస పెంపకం కొరకు దరఖాస్తులు ఎక్కువగా స్వీకరించాలన్నారు. మినీ గోకులం నిర్మాణాలకు ఎక్కువమంది లబ్ధిదారులను గుర్తించి, వారందరికీ శాంక్షన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. నట్టల నివారణ మందులను గొర్రెల పెంపకం దారులందరూ ఉపయోగించుకునేలా చూడాలన్నారు. ఈ సమీక్షలో గొలుసు విజయ్ కుమార్, పశువైద్యాధికారులు డాక్టర్ పి.అనిల్, డాక్టర్ బి.శ్రీవాణి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జనసేనలో సర్పంచ్ చేరిక

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని వైసిపికి చెందిన చీపురుపల్లి సర్పంచ్ ఈశ్వరరావు, మాజీ ఎంపిటిసి నందిగాం సింహాద్రి తన అనుచరులతో శుక్రవారం సుడా ఛైర్మన్ కొరికన రవికుమార్, కోరికాన భవాని ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పరిపాలన విధానానికి ఆకర్షితులమై జనసేనలో చేరినట్లు వారు తెలిపారు. సుడాస్ ఛైర్మన్ కొరికాన రవికుమార్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు చంద్రమోహన్, గేదెల చైతన్య, కోత పూర్ణచంద్రరావు, దుక్క బాలరాజు, దొర విజయ్ కుమార్, రాజాన మోహన్ రావు, సవర రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

విధిగా చెత్త సేకరణ

ప్రజాశక్తి- పలాస

గ్రామాల్లో చెత్త సేకరణ విధిగా జరగాలని, ఆ దిశగా పంచాయతీ అధికారులు పని చేయాలని ఎంపిడిఒ కె.వసంత కుమార్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. మండలం గురుదాసుపురంలో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటా సేకరించిన చెత్తను చెత్త నుంచి సంపద కేంద్రానికి తరలించి తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా ఉంచాలన్నారు. పొడి చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారు చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఉన్న చెత్త నిల్వలను తొలగించాలని, కాలువలు శుభ్రం చేయాలని, పారిశుధ్యం మెరుగుపై దృష్టి సారించాలన్నారు. వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు సర్పంచ్ కుత్తుం రూపావతి, టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణరావు, డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

'నాగళ్ల'కు ఎమ్మెల్యే అభినందన

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని 10వ వార్డు హడ్కోకాలనీకి చెందిన నాగళ్ల మురళీధర్‌కు ఎమ్మెల్యే కూన రవికుమార్ అభినందనలు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఇటీవల రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం యువజన ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మురళీధర్‌ను శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ జిల్లా టిడిపి బిసి, యాదవ సంఘం కార్యదర్శిగా పదవులు నిర్వహిస్తూ టిడిపిలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ మెట్టక్కివలసలో టిడిపి ఉన్నతికి కృషి చేస్తున్నందుకు ఇటీవల అవార్డును అందుకొని చురుగ్గా వ్యవహరిస్తున్నాడన్నారు. ఈ సందర్భంగా మురళీధర్‌కు మాజీ మున్సిపల్ ఛైర్మన్ తమ్మినేని గీత, రాష్ట్ర టిడిపి నాయకుడు మొదలవలస రమేష్, పట్టణ మహిళా అధ్యక్షులు బోయిన సునీత, బాలల హక్కుల కమిషన్ మాజీ మెంబర్ పివివి ప్రసాద్, టిడిపి నాయకులు రీసు చిరంజీవి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి

పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్

మాట్లాడుతున్న వినోద్‌కుమార్

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ ఆలోచనను తక్షణమే ప్రభుత్వం విరమించుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలాస పిడిఎస్‌యు కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ తాము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 107, 108 జిఒలు రద్దు చేస్తామని హామీఇచ్చారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అసంపూర్తిగా ఉన్న 17 మెడికల్ కళాశాల పనులు పూర్తి చేయకపోగా మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణకు పూనుకోవడం దారుణమన్నారు. పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్ షిప్ విధానాన్ని (పి4) తీసుకొచ్చి మెడికల్ కళాశాలల భూములు 60 ఏళ్లకు కార్పొరేట్ శక్తులకు లీజుకి ఇచ్చే ప్రయత్నాలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆధీనంలో మెడికల్ కళాశాలలు నిర్వహించలేమని జాతీయ మెడికల్ కౌన్సిలకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయడం సరైన నిర్ణయం కాదన్నారు. వీటిని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న 17 మెడికల్ కళాశాల పనులు కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి వెంటనే పూర్తి చేయాలని, లేనిపక్షంలో జులై మొదటి వారంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని ప్రభుత్వానికి హెచ్చరించారు. సమావేశంలో ప్రవీణ్, పవన్, సోమేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ

పాతపట్నం : మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- పాతపట్నం

ప్రభుత్వం అమలు చేస్తున్న గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని గొర్రెల పెంపకందారులు అందరూ ఉపయోగించుకోవాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పిలుపునిచ్చారు. మండలంలో జరుగుతున్న నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలకు, మేకలకు ఎంతో మేలు చేసే ఈ నట్టల నివారణ మందులను తప్పక వేయించుకోవాలని సూచించారు. ఈ నట్టల నివారణ మందులతో జీవాల బరువు పెరుగుతుందని, వ్యాధుల బారిన పడకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు, మండల టిడిపి అధ్యక్షులు పైల బాబ్జి, టిడిపి పట్టణ అధ్యక్షులు సైలాడ సతీష్, తీమర సర్పంచ్ ధనుంజయ్, పశువైద్యాధికారులు డాక్టర్ పి.అనిల్, డాక్టర్ శ్రీవాణి, పశు వైద్య సిబ్బంది గుణాలమ్మ, కుమారి, నిరంజన్, శ్యామ్, భీమారావు, రామ్మోహన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మండలం చిన్న నారాయణపురంలో 450 జీవాలకు నట్టల నివారణ మందులు పట్టడం జరిగిందని పశు వైద్యాధికారి డా. ఎం.పూర్ణ చంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇప్పిలి జగదీష్, పశువైద్య సిబ్బంది, గొర్రెలు, మేకలు పెంపకదారులు పాల్గొన్నారు.

నౌపడ: సంతబొమ్మాళి మండల కేంద్రంలో మండల టిడిపి నాయకుల ఆధ్వర్యంలో 850 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జయంతి ప్రసాద్, పశువైద్యులు రాజ్ కిరణ్, గౌతమ్, టిడిపి నాయకులు రెడ్డి అప్పన్న, కూచెట్టి కాంతారావు, మెండ అప్పారావు, కృష్ణారావు, అసిరినాయుడు, వసంతరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత స్వార్థం కోసం తప్పుడు ప్రచారం

డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు

సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

వ్యక్తిగత స్వార్థం కోసం కొందరు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు అన్నారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను డిసిసి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన మరుక్షణం నుంచి కొంతమంది తనపై దాడులు చేస్తున్నారని చెప్పారు. వాళ్ల తప్పులు కప్పిపుచ్చుకోవడానికే గతంలో ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో అగ్ని ప్రమాదం చేశారని ఆరోపించారు. పిసిసి జిల్లా విస్తృతస్థాయి సమావేశం విజయవంతమైందని, ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. వారి పతనానికి వారే పునాదులు వేసుకుంటున్నారని విమర్శించారు.

ఎస్‌సి విభాగం జిల్లా అధ్యక్షులు తెంబూరు మధుసూదనరావు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలకు కోవర్టులుగా ఉంటూ కాంగ్రెస్ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. కోవర్టులను అధిష్టానం బహిష్కరించాలని కోరారు. పార్టీ ప్రగతికి కృషి చేయకుండా వెన్నుపోటు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో డిసిసి ఉపాధ్యక్షులు ఇజ్జురోతు రమణ, డిసిసి ప్రధాన కార్యదర్శి సాయిదుల్లా ఖాన్, ఎచ్చెర్ల, ఆమదాలవలస నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు ఆబోతుల వెంకట నాయుడు, బొత్స వెంకటరమణ పాల్గొన్నారు.

రాజేష్‌కు ఆత్మీయ సత్కారం

రాజేష్‌ను సన్మానిస్తున్న అగ్నికుల క్షత్రియ సంఘం సభ్యులు

ప్రజాశక్తి- కవిటి

జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్‌ను కవిటి మండలంలోని అగ్నికుల క్షత్రియ సంఘ సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. పొల్లాయి లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో సంఘ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో లోల్ల రాజేష్ మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియ సంఘం అభివృద్ధికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. సంఘ సభ్యుల అభ్యర్థన మేరకు ఫ్యాన్ల కొనుగోలుకు రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో జనసేన ఇచ్ఛాపురం మండల నాయకుడు చీకటి కృష్ణయ్య, నాయకులు బైపల్లి దాలయ్య, ప్రశాంత్, పొల్లాయి సింహాచలం, పి దేవరాజు, పి కృష్ణ, దున్న పురుషోత్తం, తెప్పల మోహనరావు, పి ఉమా మహేశ్వరరావు, దున్న కృష్ణారావు, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బిందు మాధవి

వందేమాతరం రచయితకు ఘన నివాళి

ప్రజాశక్తి- కవిటి

భారత జాతీయ గేయం వందేమాతరం రచించిన మహాకవి బంకించంద్ర చటోపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని స్థానిక కళ్యాణి పాఠశాలలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బిందుమాధవి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మన దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను ఉద్రూతలూగించిన గేయం వందేమాతరం. దీనిని రచించిన బంకించంద్ర చటోపాధ్యాయ భారతీయ సాహిత్యంలో ఎనలేని స్థానం పొందిన కవి, రచయిత అని కొనియాడారు. ఈ గేయం ఉద్యమకారుల నోటినుంచి సైనికుల చేతికి చేరి బ్రిటిష్ పాలకులను గడగడలాడించిందని కొనియాడారు. అంతేకాకుండా బంకించంద్రను బ్రిటిష్ అధికారులు 'చటోపాధ్యాయ' అనే పేరును పలకలేక 'ఛటర్జీ'గా పిలిచేవారన్న విషయాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఎఒ రాణి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని రణస్థలంకు చెందిన పైడపల్లి అప్పల నరసయ్య (పండు) కుమార్తెకి గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స విశాఖపట్నం ఆస్పత్రిలో నిర్వహించి ఇంటికి తీసుకుని వచ్చిన సందర్భంగా శుక్రవారం వారి స్వగృహంలో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పరామర్శించారు. పరామర్శ అనంతరం ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు, ఎచ్చెర్ల నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు మజ్జి రమేష్, ఉప సర్పంచ్ కెల్ల ఆదినారాయణ, బొంతు సూరి, బొంతు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి- పొందూరు

మండలం కేశవదాసుపురానికి చెందిన నాగవరపు రాజేష్ కుటుంబానికి శుక్రవారం ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల సిఎం సహాయనిధి చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే రవికుమార్ ఆదేశాల మేరకు ఆయన స్వగృహంలో జిల్లా టిఎన్‌టియు అధ్యక్షులు గాడు నారాయణరావు ఆధ్వర్యంలో రాజేష్ కుటుంబానికి రూ.1.09 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో శాలివాహన సంఘం సభ్యులు గోవిందరావు, ఈశ్వరరావు సత్యరాజు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న మాజీ ఎంపిపి ప్రమీల